## క్లుప్తంగా

### స్వాములకు అన్నదానం



స్వాములకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం

**తాళ్లరేవు:** మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం సుంకరపాలెంలోని శివాలయం వద్ద శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మల్లిపూడి చంద్రరావు, స్వాములు నందికోళ్ల సతీష్, సుంకర బద్రి, నాయకులు గుంటముక్కల విష్ణు, కేశనకుర్తి చిన్న, గురజాపు లోవరాజు, మడికి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

### విశ్వేశ్వరస్వామి ఆలయంలో కుంభ నైవేద్యం



నడిపూడిలో విశ్వేశ్వరస్వామికి కుంభ నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

**అమలాపురం రూరల్:** మండలంలోని నడిపూడిలో అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపావళి రోజున కాశీలో అన్నపూర్ణమ్మ వారికి సమర్పించినట్లుగా కుంభ నైవేద్యం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పండు స్వామి ఆధ్వర్యంలో క్రతువు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అరిగెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అధికారి వెంకటేశ్వరరావు, అరిగెల బాబి, ఆర్వీ నాయుడు, అధికారి బాబ్జి, కేకే స్వామి పాల్గొన్నారు.

### ఘనంగా గోవర్ధనగిరి పూజ



గోవర్ధనగిరి గోపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

**అమలాపురం రూరల్:** మండలంలోని జనుపల్లిలో ఇస్కాన్‌కు కేటాయించిన స్థలంలో గోవర్ధనగిరి పూజ, గోపూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ స్టాల్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, సర్పంచ్ గాణాల భారతి, తుని వైఎస్సార్ సీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిమాయిదాస్, అమలాపురం అవుట్ పోస్ట్ సెంటర్ ఇన్‌చార్జ్ శివానంద నిమాయిదాస్, కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ, పెంకే రామ్మోహన్‌రావు, వేమన సూర్యనారాయణ, గొవ్వాల రమణ పాల్గొన్నారు.

### చతుర్ధ శాంతి యమధర్మ స్థూపం నిర్మాణం



అమలాపురంలో నిర్మిస్తున్న చతుర్ధ శాంతి యమ ధర్మ స్థూపం

**అమలాపురం టౌన్:** స్థానిక దక్షిణమూర్తి శక్తి స్థల్‌లో బహుళ చతుర్ధి తిథి సందర్భంగా నిర్వహించే జ్యోతిర్లింగార్చన కోసం చతుర్ధ శాంతి స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు అమలాపురం శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ప్రతినిధులు తెలిపారు. పద్నాలుగు లోకాలకు ప్రతీకగా పద్నాలుగు అరలతో వెయ్యి కేజీల బరువుతో రూ.1.50 లక్షల వ్యయంతో స్థూపాన్ని నిర్మిస్తున్నామన్నారు. స్థూప నిర్మాణానికి స్థానిక సత్యం స్కూల్ చైర్మన్ సలాది సత్యనారాయణ రూ.25 వేలు, చెన్నైకి చెందిన కొమ్ముల మాలతి రూ.10 వేలు, రేకపల్లి సోమేశ్వరరావు రూ.5 వేలు వంతున విరాళంగా అందించారని చెప్పారు.

### వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ షెడ్యూల్ విడుదల

**అల్లవరం:** ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమ మొదటి షెడ్యూల్‌ని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ సోమవారం విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి ఈ నెల 23 వరకూ రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 14న అల్లవరం-1, 15న అల్లవరం-2, 16న బెండమూర్లంక, 17న డి.రావులపాలెం, 20న దేవగుప్తం, 21న గోడిలంక, 22న గోడి, 23న గోడితిప్ప గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

### మహాశక్తి యాగానికి తరలి రండి

**తాళ్లరేవు:** పరిపూర్ణానంద స్వామి వారి ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి కాకినాడ శ్రీపీఠంలో నిర్వహించనున్న మహాశక్తి యాగానికి భక్తులందరూ తరలిరావాలని శివ భక్తుడు తుపాకుల ప్రసాదరావు కోరారు. సోమవారం సుంకరపాలెం శివాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 30 రోజులపాటు శతకోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

# వయసులో చిన్న.. ప్రతిభలో మిన్న..

- విభిన్న అంశాల్లో రాణిస్తున్న చిన్నారులు
- నేడు బాలల దినోత్సవం




జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న బిందుశ్రీ



ఫ్యూచర్ సాల్వ్ హ్యాక్‌థాన్‌లో పురస్కారం పొందిన యశ్వంత్‌కృష్ణ

**యానాం:** వయసులో చిన్నవారైనా ప్రతిభలో మిన్న అని చాటుతున్నారు పలువురు చిన్నారులు. యానాం నియోజకవర్గానికి చెందిన పలువురు బాలలు క్రీడలు, విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు, సంగీతం, సేవా రంగాల్లో సైతం రాణిస్తూ అందరి చేత భళా అనిపిస్తున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న బాలలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు**

- యానాం నవోదయ విద్యాలయంలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి సీహెచ్ రిష్యేంద్రనాథ్‌రెడ్డి చదరంగంలో అసాధారణ ప్రతిభ చాటుతున్నాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగిన అండర్-17లో అఖిల భారత స్థాయి చదరంగం పోటీల్లో తన ప్రత్యర్థులను ఓడించి స్వర్ణపతకం సాధించడమే కాకుండా ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలకు సైతం అర్హత సాధించాడు.
- చిన్ననాటి నుంచే పరిశోధించే తత్వాన్ని అలవాటు చేసుకున్న నవోదయలో 8వ తరగతి చదువుతున్న దుర్గేష్ తన పరిశోధనలతో అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికై ప్రతిభ చాటాడు. శరీర సౌష్టవాన్ని(బాడీ మాస్ ఇండెక్స్) కొలతలపై దుర్గేష్ పరిశోధించి తాను తయారుచేసిన సైన్స్ ప్రాజెక్టును జాతీయస్థాయిలో ప్రదర్శించారు.
- ఇసుకపట్ల బిందుశ్రీ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో రాణించి అనేక పతకాలు, అవార్డులు సాధించింది. రెండు సార్లు జాతీయ సబ్ జూనియర్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. స్టేట్ మీట్‌లో బెస్ట్ ప్లేయర్ అవార్డు, స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు, స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు సైతం కైవసం చేసుకుంది. కోర్టులో దిగితే గెలుపే లక్ష్యంగా అనేక విజయాలు సొంతం చేసుకుంటూ దూసుకుపోతుంది.
- వయోలిన్‌లో చిన్ననాటి నుంచే విశేష ప్రతిభ చాటుతున్నాడు సాలగ్రామ సత్యతారక్. స్థానిక రీజెన్సీ స్కూల్‌లో చదువుతున్న సత్యతారక్ రాష్ట్ర స్థాయిలో పలు ఉత్సవాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చి భళా అనిపించాడు. అదేవిధంగా అతని సహచరులు టి.షణ్ముకశాస్త్రి, ఎ.కస్యప్, టి.శరణ్‌లు సైతం ప్రదర్శనలు ఇస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు.
- నవోదయ 8వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కృష్ణ అడవుల్లో కార్చిచ్చు రగిలినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై రూపొందించిన ప్రాజెక్టు ఇటీవల హైదరాబాద్‌లో ట్రిపుల్ ఐటీ వేదికగా జరిగిన ఫ్యూచర్ సాల్వ్ హ్యాక్‌థాన్(బిల్డింగ్ టుమారో టుగెదర్)లో అందరినీ ఆలోచింపజేసింది. యశ్వంత్‌కృష్ణ ద్వితీయ పురస్కారం పొందారు.
- హైదరాబాద్ టి-హబ్ వేదికగా జరిగిన వివిధ రంగాల్లో ఖ్యాతినార్జించిన వ్యక్తుల విజయ రహస్యాలను పాలు పంచుకునే ×ది హాఫ్ ఆఫ్ బ్రిక్ౕ అనే కార్యక్రమంలో నవోదయ విద్యార్థిని ఏంజెల్ యూత్ ఐడియా థాన్‌లో టీమ్ లీడర్‌గా నాయకత్వం వహించింది. ఈ సందర్భంగా బాలికాసాధికారికతపై ఏంజెల్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.



రాష్ట్ర స్థాయి వయోలిన్ ప్రదర్శనలో ప్రతిభ చాటుతున్న షణ్ముకశాస్త్రి



హైదరాబాద్‌లో జరిగిన 'ది హాఫ్ ఆఫ్ బ్రిక్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని ఏంజెల్

### జగనన్న ప్రగతి పథం పోస్టర్ విడుదల



జగనన్న ప్రగతి పథం పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి విశ్వరూప్

**అమలాపురం రూరల్:** ఈ నెల 18వ తేదీన వైఎస్సార్ సీపీ ఐటీ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే జగనన్న ప్రగతి పథం కార్యక్రమ పోస్టర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ఆవిష్కరించారు. జగనన్న ప్రగతి పథం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి విశ్వరూప్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీని కలిసిన ఓఎన్‌జీసీ యూనియన్ సభ్యులు



ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఓఎన్‌జీసీ ఉద్యోగులు

**అల్లవరం:** మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ చింతా అనురాధని రాజమండ్రి ఓఎన్‌జీసీ అసెట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎంపీ అనురాధ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి రవీంద్రసునావత్, సీఈసీ మెంబర్లు రాజకుమార్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

### సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

**అమలాపురం టౌన్:** జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమవుతున్న సహకార వారోత్సవాలను ఆయా వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, త్రీమెన్ కమిటీలు, సంఘాల్లో సభ్యులైన రైతులు విజయవంతం చేయాలని డీసీవో ఎ.రాధాకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 15 డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో ఉన్న 166 వ్యవసాయ సహకార సంఘాల్లో ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజైన మంగళవారం ఉదయం అమలాపురంలోని డీసీసీబీ బ్రాంచి భవనంలో వారోత్సవాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీసీసీబీ జనరల్ మేనేజర్ పీఎస్ ప్రకాశం ప్రారంభిస్తారని జిల్లా వారోత్సవాల ఇన్‌చార్జి, జిల్లా సహకార ట్రైనర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు తెలిపారు. వారోత్సవాల్లో రోజుకో సహకార అంశంపై నిర్వహించే కార్యక్రమాలు, చర్చల్లో రైతులు విధిగా పాల్గొని సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రక్షణ గట్టు పునర్నిర్మాణ పనుల పరిశీలన



గోదావరి వరద రక్షణ గట్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

**యానాం:** నియోజకవర్గ శివారు దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీకి చెందిన పంట పొలాల వెంబడి ఉన్న గోదావరి వరద రక్షణ గట్టు నాలుగు నెలల క్రితం వచ్చిన వరదలకు కూలిపోయింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన సొంత ఖర్చులతో గట్టు పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. సోమవారం దరియాలతిప్పలోని ఐలాండ్-3 పరిధిలో జరుగుతున్న రక్షణ గట్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వరదలకు రక్షణ గట్టు కొట్టుకుపోయి తమ పొలాలు ముంపునకు గురయ్యాయని, రక్షణ గట్టు నిర్మించాలని ఎమ్మెల్యే అశోక్‌కు విన్నవించుకున్నామన్నారు. ఆయన స్పందించి సొంత ఖర్చులతో పనులు చేయిస్తున్నారన్నారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ద్వారా నిధులు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. కార్యక్రమంలో తిరుకోటి నాగేశ్వరరావు, కొల్లు మాధవ స్వామి, రైతు నాయకులు కోరుకొండ ఆనంద్, సబ్బంతి శ్రీను, లోకేష్, కోల్లు నూకాంబరం, గిడ్ల బాలయోగి పాల్గొన్నారు.

## సర్వాంగ సుందరంగా శివాలయాలు



పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

**ఐ.పోలవరం:** మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంతో పాటు కేశనకుర్రు, టి.కొత్తపల్లి, ఎదుర్లంక, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలను సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణ, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారాలు, నాగుల చవితి, ఏకాదశి, పంచమి, జ్వాలాతోరణం తదితర రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు తెలిపారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న ఏకాదశి, 26న పౌర్ణమి తిథిని పురస్కరించుకుని చండీ హోమం, జ్వాలాతోరణం, 30న ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని రుద్ర హోమం, వచ్చే నెల 8న ఏకాదశి పర్వదినం, 11న మాసశివరాత్రి, లక్షపత్రి పూజ నిర్వహిస్తామని చెప్పారు.

## ప్రధాని దిష్టి బొమ్మ దహనం



ఎస్.కొత్తపల్లిలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎస్సీ నాయకులు

**ఉప్పలగుప్తం:** ఎస్సీ వర్గీకరణపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనను వ్యతిరేకిస్తూ మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో ఎస్సీ యువజన సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి, అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, భీమవరపు ఏడుకొండలు, గోసంగి శ్రీనువాసరావు, నేరేడుమిల్లి దుర్గారావు, కొల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పేకాట క్లబ్‌కు వ్యతిరేకంగా నిరసన



మెట్టకూరులో పేకాట క్లబ్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన

**యానాం:** నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరులో నివాసాల చెంత పేకాట క్లబ్ నిర్వహణను వ్యతిరేకిస్తూ పలువురు మత్స్యకారులు సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత లక్ష్మీగణపతి రైస్‌మిల్లు ప్రాంగణంలో తొమ్మిది నెలల క్రితం విక్టరీ క్లబ్ పేరిట పేకాట కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే తాము ఆందోళన చేపట్టామన్నారు. క్లబ్ ఏర్పాటుకు తాము అనుమతివ్వమని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించామన్నారు. అయితే మళ్లీ క్లబ్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలియడంతో తాము ఆందోళన బాట పట్టినట్లు పేర్కొన్నారు. ఆందోళనకారులు ఆర్ఏఓ. మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లవరపు దయ, మల్లాడి రాంబాబు, ఓలేటి రమణ, పాపారావు, కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

## దిశ యాప్ డౌన్‌లోడ్‌తో వస్త్రాలపై రాయితీ

**అమలాపురం టౌన్:** పట్టణంలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే మహిళలకు ఎంపిక చేసిన మూడు వస్త్ర దుకాణాల కొనుగోళ్లపై 15 శాతం రాయితీ ఇప్పిస్తామని డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఒక్క రోజు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. పట్టణంలోని చందన బ్రదర్స్, ఆర్ఆర్ఆర్ షాపింగ్ మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌లో కొనుగోళ్లపై 15 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. ఈ మూడు దుకాణాల్లో మహిళల చేత దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చేయించేందుకు మహిళా పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. పోలీసులు చేస్తున్న ఈ ప్రయత్నానికి మహిళలు సహకరించాలని ఆయన కోరారు.

## అదొక రాజకీయ డ్రామా



సంఘీభావాన్ని ప్రకటిస్తున్న మాల మహానాడు నాయకులు

**అమలాపురం టౌన్:** దాదాపు కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మళ్లీ తెర మీదకు తేవడమంటే తాజా రాజకీయ డ్రామాయేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు అన్నారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు పినిపే రాధాకృష్ణ అధ్యక్షతన స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో సోమవారం సాయంత్రం జరిగిన మాల మహానాడు సమావేశానికి భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తలకిందులుగా తపస్సు చేసినా ఎస్సీ వర్గీకరణ జరగదని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రధాన మంత్రి మోడీ ఓ వర్గానికి కొమ్ముకాస్తూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెర మీదకు తేవడం బాధాకరమని పేర్కొన్నారు. సమావేశ వేదికపై నాయకులంతా చేయి చేయి కలిపి సంఘీ భావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, నామాడి శివాజీ, మాకే సిద్ధు, ఉబ్బన శ్రీను, రేవు ప్రసాద్, మాకే మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

### తాటాకిల్లు దగ్ధం

**యానాం:** యానాం శివారు గ్రామమైన కనకాలపేట పరిధిలోని గణపతినగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దీపావళి సందర్భంగా ఎవరో కాల్చిన బాణసంచా గణపతినగర్‌కు చెందిన ఉప్పు కుమారి తాటాకు ఇంటిపై పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానిక యువకుల సమాచారంతో యానాం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. సమాచారం అందించిన యువకులను ఎస్ఐ శేరు నూకరాజు అభినందించారు.

## అయ్యప్ప స్వాముల పాదయాత్ర

**పి.గన్నవరం:** పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని, రైసు మిల్లర్ల వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ నాయకుడు గణేశుల చిన కొండలరావు ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వాములు అమలాపురం వరకూ పాదయాత్ర నిర్వహించారు. పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్ నుంచి ముంగండ, మాచవరం, అంబాజీపేట, బండారులంక గ్రామాల మీదుగా అమలాపురంలో అయ్యప్ప స్వామి వారి ఆలయం వరకూ పాదయాత్ర జరిగింది. అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం మండలంలోని అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

### 14 మద్యం సీసాలు స్వాధీనం

**అల్లవరం:** మండలంలోని బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని బోడసకుర్రుపాలెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న అవల నాగమణిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ శివరామరాజు సోమవారం తెలిపారు. ఆమె వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన జంధ్యాల అరవింద్, విజయలక్ష్మి దంపతులు సోమవారం రూ.50 వేల విరాళం అందించారు. వారి కుమార్తెలు దీప్తి, శ్వేత, వారి కుటుంబ సభ్యులు ఈ విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. ట్రస్టుబోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఘనంగా తిరు నక్షత్రోత్సవాలు



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న మండలంలోని వాడపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మానవాళీ మహాముని ఆళ్వార్ తిరు నక్షత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పుణ్యాహవాచనం, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామికి అష్టోత్తర పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మానవాళీ మహాముని ఆళ్వార్ తిరు నక్షత్రోత్సవాల్లో భాగంగా దేవతా మూర్తుల విగ్రహాలను పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైభవంగా స్వామి కల్యాణం

**మామిడికుదురు:** వేద మంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా పెదపట్నంలంక గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఈ కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువును అర్చకులు ఘనంగా జరిపించారు. వేద పండితులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, జ్యోత్స్నుల సోమయాజులు నేతృత్వంలో ఈ వేడుక ఆద్యంతం కమనీయంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, బత్తుల విజయగంగారత్నం, గూటం శ్రీను, నగరం ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు



కనకదుర్గ ఆలయం వద్ద వెలిగించిన దీపాలు



అమలాపురంలో ఆకాశదీపం వదులుతున్న మంత్రి విశ్వరూప్

**అమలాపురం రూరల్:** దీపావళి పండగను ఇంటింటా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నా పెద్దా అంతా ఇంటి ముంగిళ్లలో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. మిఠాయిలు పంచుకుని దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భట్నవిల్లిలో మంత్రి నివాసంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి బాణసంచా కాల్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలన్నీ టపాసుల మోతతో దద్దరిల్లాయి. ఉదయం నుంచి ఆలయాలు దీపావళి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. అమలాపురం గాంధీనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఓంకారంతో దీపాలు వెలిగించారు.



యానాంలో బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే అశోక్, స్నేహ దంపతులు

**యానాం:** నియోజకవర్గ పరిధిలో ఆదివారం రాత్రి దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. పలు దేవాలయాలను విద్యుత్ దీపాలు, ప్రమిదలతో అలంకరించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, స్నేహ దంపతులు దీపావళి వేడుకల్లో పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో బాణసంచా విక్రయాల కోసం హోల్‌సేల్ వ్యాపారులకు రెండు నెలల క్రితమే లైసెన్స్‌లు జారీచేసిన నేపథ్యంలో కోట్లాది రూపాయిల మేర వ్యాపారం జరిగింది. దీపావళి రోజున సైతం ముఖ్యంగా సుంకరపాలెం బైపాస్, నీలపల్లి చెక్‌పోస్టు సమీపంలో దుకాణాల వద్దకు జనం తండోపతండాలుగా తరలిరావడంతో యానాం-అమలాపురం-కాకినాడ జాతీయ రహదారి కిక్కిరిసింది.